క్లుప్తంగా

నేడు రక్తదాన శిబిరం

పరిగి: ఆర్టీసీ ఆధ్వర్యంలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు డీఎం పవిత్ర సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పరిగి డిపోలో ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు, ప్రజలు పాల్గొని రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని కోరారు.

రక్తమైసమ్మకు ప్రత్యేక పూజలు



ఆలయం వద్ద అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి

తాండూరు టౌన్: ఇటీవల కర్నాటకలో జరిగిన రోడ్డు ప్రమాదం నుంచి సురక్షితంగా బయట పడినందుకు.. ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి పట్టణంలోని మర్రిచెట్టు కూడలి వద్ద గల రక్త మైసమ్మ ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పలువురికి అన్నదానం చేశారు.

వైస్ చైర్‌పర్సన్‌కు సన్మానం



వైస్ చైర్‌పర్సన్ వాణిశ్రీ దంపతులను సన్మానిస్తున్న మైనార్టీ నాయకులు

కొడంగల్ రూరల్: నూతనంగా ఎన్నికైన మార్కెట్ కమిటీ వైస్ చైర్‌పర్సన్ వాణిశ్రీని వారి నివాసంలో సోమవారం ముస్లిం మైనార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వాణిశ్రీ మరెన్నో ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ ఎస్ఎం. గౌసన్, మైనార్టీ టౌన్ ప్రెసిడెంట్ ఇర్ఫాన్, రహీమ్, ఫాహద్, జావిద్, షేక్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

యువత స్వశక్తితో ఎదగాలి



టీ స్టాల్‌ను ప్రారంభిస్తున్న డీసీసీబీ చైర్మన్ మనోహర్ రెడ్డి తదితరులు

కుల్కచర్ల: యువత స్వశక్తితో ఎదిగి, ఆర్థికంగా నిలదొక్కుకోవాలని డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు. సోమవారం చౌడాపూర్ మండల కేంద్రంలో టీ, టిఫిన్ స్టాల్‌ను ప్రారంభించి మాట్లాడారు. యువత పెడదారి పట్టకుండా.. కుటుంబ అభ్యున్నతి కోసం ఆర్థిక ఉన్నతికి స్వయం ఉపాధిని ఎంచుకోవాలని, అదేవిధంగా ప్రభుత్వాలు కల్పించే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాందాస్ నాయక్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాగరాజు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సత్తినేని సుధాకర్ రెడ్డి, నాయకులు రాజప్ప, మొగులయ్య, రవి, కృష్ణయ్య, ఆంజనేయులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పేదకుటుంబాలకు ఆర్థిక సాయం

దోమ: పేదల అభ్యున్నతికి కృషి చేస్తానని డీసీసీబీ చైర్మన్ మనోహర్ రెడ్డి అన్నారు. సోమవారం దోమ మండలం దిర్సంపల్లి, బుద్లాపూర్, దాదాపూర్ కొండాయపల్లిలో మంగళి మణెమ్మ, తుంకలి బీమమ్మ, నర్సయ్య, చాకలి వెంకటయ్య, కావలి వెంకటయ్య, బోయ చిట్టెమ్మలు అనారోగ్యాలతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మనోహర్‌రెడ్డి బాధిత కుటుంబాలను పరామర్శించి ఒక్కో కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సహాయం చేశారు. జిల్లా గ్రంథాలయాల సంస్థ డైరెక్టర్ బంగ్ల యాదయ్య గౌడ్, సర్పంచులు పాల్గొన్నారు

విక్రయాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి



ఫర్టిలైజర్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏడీఏ

ధారూరు: విత్తనాలు విక్రయిస్తున్న సమయంలోనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని వికారాబాద్ వ్యవసాయ డివిజన్ ఏడీఏ వినోద్‌కుమార్ ఫర్టిలైజర్ దుకాణాల యజమానులకు సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని పలు ఫర్టిలైజర్ షాపులను ఆయన తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి మాట్లాడారు. అన్ని రకాల విత్తనాలను విక్రయించే డీలర్లు వారి లైసెన్సులు, విత్తన తయారీ సంస్థల ప్రిన్సిపుల్ సర్టిఫికెట్లను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. అనంతరం విత్తనాల అమ్మకాల విధానాన్ని ఏడీఏ డీలర్లకు సూచించారు.

మోతాదు మించితే ప్రమాదమే

- విష రసాయనాలతో పెరుగుతున్న పెట్టుబడి
- డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులను దుక్కిలో వేసుకోవాలి
- వ్యవసాయ అధికారులు



పత్తి విత్తుకునేందుకు పైపైనే వేసిన డీఏపీ ఎరువు

మోమిన్‌పేట: 'మోతాదుకు మించి ఎరువులు వాడితే ప్రమాదకరం. వద్దని రైతులకు ఎన్ని సార్లు చెప్పినా రసాయనిక ఎరువులను అధికంగా వాడుతున్నారు. డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులు దుక్కిలో వేసి కలియ దున్నుకుంటేనే మొక్కలకు బలాన్ని ఇస్తుందని చెప్పినా వినడం లేదు. వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలను రైతులు పట్టించుకోవడం' లేదు అని వ్యవసాయ అధికారులు స్పష్టం చేస్తున్నారు. పైపాటుగా డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులను చల్లుతున్నారని, యూరియాను మాత్రమే పైపాటుగా, అది భూమిలో తేమ ఉన్నప్పుడే వేసుకోవాలని చెప్పినా.. రైతులు ఒకరిని చూసి ఇంకొకరు డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులను పైపైనే పత్తి పంటలకు వేస్తున్నారని చెబుతున్నారు. తద్వారా పెట్టుబడులు పెరుగుతాయంటున్నారు. ఇలా వేయడం వలన మొక్కలకు ఎలాంటి పోషకాలు అందవని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. డీఏపీని కేవలం దుక్కిలోనే వేసుకోవాలని చెబుతున్నా.. అదే ధోరణి అవలంభిస్తున్నారని చెప్పారు.

డీఏపీ మొక్కలకు అందేందుకు..

డీఏపీలో డై అమ్మోనియం ఫాస్ఫేట్ ఉంటుంది. అందు వలన అది దుక్కిలో మాత్రమే కలిసిపోతుంది. డీఏపీని పైపైనే వేయడం వలన అందులో ఉన్న ఫాస్పరస్ వేర్లకు అందక నిరర్థకమవుతుంది. భాస్వరం వేళ్లకు అందితేనే మొదళ్లు దృఢంగా ఉండి పంట ఏపుగా పెరుగుతుంది. లేదంటే ఎక్కడ వేసిన డీఏపీ అక్కడే ఉంటుంది. మొక్క వేరుకు అందే విధంగా గుంత తీసి అందులో డీఏపీ వేసి మట్టి కప్పాలి. మోతాదుకు మించి డీఏపీని వాడటం వలన మొక్కకు అందుతున్న సూక్ష్మ పోషకాలైన జింకు, మెగ్నీషియం, సల్ఫర్, కాల్షియం అందకుండా చేస్తుంది. డీఏపీ మొక్కలకు అందేందుకు 30నుంచి 35 రోజులు పడ్తుంది. డీఏపీని ప్రతి పంటకు దుక్కిలోనే వేసుకొని కలియ దున్నాలి. దీని వలన మట్టిలో అది పూర్తిగా కలిసిపోయి పంటకు పోషకాలను అందిస్తుంది. వర్షం తక్కువగా, ఎక్కువగా ఉన్నప్పుడు యూరియాను ఒక లీటరు నీటిలో 4 గ్రాములు కలిపి స్ప్రే చేయాలి. లేదా లిక్విడ్ యూరియాను పంటపై పిచికారి చేయాలి. యూరియాను ఎక్కువ మోతాదులో వాడితే మొక్కలకు చీడపీడలు ఆశించే ప్రమాదం ఉంది.

ప్రతి సమావేశంలో చెప్పినా..



ప్రతి రైతు సదస్సులో డీఏపీని పైపాటుగా వేయకూడదని చెబుతున్నాం. అలా వేసిన డీఏపీ మొక్కలకు పోషకాలు అందించదని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. దుక్కిలో వేసుకొని కలియ దున్నుకుంటేనే వేసిన ఎరువు మొక్కలకు అందుతుంది. వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు రైతులు పాటించాలి.

– జయశంకర్, మండల వ్యవసాయ అధికారి

గ్రంథ పఠనానికి మరో పీరియడ్

- మూడు రోజులు తెలుగు, మరో మూడు రోజులు ఆంగ్లం
- ప్రతి విద్యార్థి స్వతంత్ర జ్ఞానం పొందాలి: ఎంఈఓ

పెద్దేముల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థి గ్రంథాలయ, పాఠ్యపుస్తకాలు ధారాళంగా చదివి, స్వతంత్ర జ్ఞానం పొందాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నెల 26నుంచి 31 తేదీ వరకు 'పఠనోత్సవ' కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని పెద్దేముల్ ప్రాథమిక పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం శ్రీనివాస్ చెప్పారు. సోమవారం స్థానిక ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులు చదివేలా బోధన చేసి మాట్లాడారు. ప్రతీరోజు ప్రత్యేకంగా విద్యార్థులను చదివించేలా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ప్రతి విద్యార్థి ఇంటి వద్ద పుస్తక పఠనం చేసేలా తీర్చిదిద్దాలని, మూడు రోజులు ఆంగ్లం, మూడు రోజులు మాతృభాష పఠనం చేయాలని, పాఠశాల, గ్రంథాలయంలో ప్రతి రోజు ఓ పీరియడ్ కేటాయించి చదివించాల్సి ఉంటుందని తెలిపారు. ఉపాధ్యాయులు నరేందర్‌రెడ్డి, నర్సిరెడ్డి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా పఠనోత్సవం

బొంరాస్‌పేట: పాఠశాలల్లో విద్యార్థులు ధారాళంగా చదవడం ఒక అలవాటుగా మార్చుకొని ఆనందం పొందడం, స్వతంత్ర పాఠకులుగా ఎదగడం కోసం రాష్ట్ర ప్రభుత్వం పఠనోత్సవం (రీడింగ్ క్యాంపెయిన్) అమలులోకి తెచ్చింది. బొంరాస్‌పేట, దుద్యాల మండలాల పాఠశాలల్లో పకడ్బందీగా అమలు చేస్తున్నారు. మనఊరు–మనబడి కార్యక్రమం అమలులో ఉన్న పాఠశాలలతో పాటు అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులందరూ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. మనఊరు–మనబడి పాఠశాలల్లో పుస్తక పఠనానికి స్కూల్‌లో మినీ గ్రంథాలయం ఏర్పాటు చేశారు. గ్రంథాలయంలో మరింత సమయం కేటాయించి కథల పుస్తకాల పఠనానికి సమయం కేటాయించి చదివించారు. విద్యార్థుల భాగస్వామ్యం చూస్తుంటే తొలిమెట్టు కార్యక్రమం మరింత సఫలీకృతం అయ్యేందుకు పఠనోత్సవం దోహదపడుతుందని ఉపాధ్యాయులు అభిప్రాయపడుతున్నారు.



పెద్దేముల్: విద్యార్థులతో పుస్తకాలు చదివిస్తున్న ఉపాధ్యాయులు

పట్టిక ప్రకారం ఆహారం అందించాలి

మండల విద్యాధికారి హరిశ్చందర్



కస్తూర్బా విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ

పూడూరు: విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు భోజనం అందించాలని మండల విద్యాధికారి హరిశ్చందర్ అన్నారు. సోమవారం పూడూరు మండలం చన్గోముల్, కస్తూర్బాగాంధీ బాలికల వసతి గృహాన్ని ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకొని మాట్లాడారు. విద్యార్థుల హాజరుశాతాన్ని పెంచేలా బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. మెనూ ప్రకారం భోజనం, గుడ్లు, ఎందుకు ఇవ్వడం లేదని హాస్టల్ ప్రత్యేక అధికారిని ప్రశ్నించారు. పట్టిక ప్రకారం భోజనం అందించాలని, లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. సీఆర్టీయూ విధిగా ప్రతి రోజు విద్యార్థులకు చెప్పిన పాఠాలను రోజువారిగా నమోదు చేసుకోవాలని సూచించారు.

ప్రజావాణిని వినియోగించుకోండి



దౌల్తాబాద్: తహసీల్ కార్యాలయంలో అర్జీలు అందజేస్తున్న ప్రజలు

దౌల్తాబాద్: తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కృష్ణయ్య సూచించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో.. భూములకు సంబంధించి, వివిధ రకాల రెవెన్యూ సమస్యలపై పలు దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో డీటీ చాంద్‌పాషా పాల్గొన్నారు.

దరఖాస్తులు నిల్

బంట్వారం: రైతులు ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని బంట్వారం, కోట్‌పల్లి తహసీల్దార్లు శ్రీనివాస్‌రెడ్డి, అష్ఫక్ రసూల్ వేర్వేరు ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం కార్యాలయాల్లో నిర్వహించిన ప్రజావాణిలో ఒక్క దరఖాస్తు కూడా రాలేదని, ధరణికి సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే మీ సేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని రైతులకు సూచించారు.

1న లారీ డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు

తాండూరు టౌన్: తాండూరు లారీ డ్రైవర్స్ అండ్ క్లీనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు జూలై 1న జరగనున్నాయి. ఈ మేరకు ఈ నెల 24న నోటిఫికేషన్ జారీ చేశారు. 26, 27 తేదీల్లో నామినేషన్ వేసేందుకు అవకాశం కల్పించారు. దీంతో సోమవారం మహ్మద్ జహూర్ హుస్సేన్, షేక్ రావల్ నామినేషన్ వేశారు. నేటితో నామినేషన్ల ప్రక్రియ ముగియనుండగా, రేపు పరిశీలించనున్నారు. 432 మంది డ్రైవర్లు, క్లీనర్లు ఉన్న అసోసియేషన్‌కు వచ్చే నెల 1న ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి, అడ్వకేట్ గోపాల్ తెలిపారు. కాగా అత్యధిక మెజార్టీతో తమను గెలిపిస్తే డ్రైవర్ల, క్లీనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నామినేషన్ వేసిన వ్యక్తులు ఈ సందర్భంగా ఓటర్లకు విన్నవించుకున్నారు.

సర్కారు బడుల్లో కొరవడిన వసతులు

- నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వం
- ఏబీవీపీ నాయకులు



ప్రభుత్వ నంబర్ వన్ పాఠశాలను మూసి వేయిస్తున్న ఏబీవీపీ నాయకులు

తాండూరు టౌన్: సర్కారు బడుల్లో మౌలిక వసతులు కొరవడ్డాయని, సౌకర్యాలు కల్పించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మానేశ్వర్ చారి ఆరోపించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ చేపట్టిన పాఠశాలల బంద్ సోమవారం ప్రశాంతంగా జరిగింది. ఈ సందర్భంగా మానేశ్వర్ మాట్లాడారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా గుణాత్మక విద్య అందేలా చూడాల్సింది పోయి.. ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఉపాధ్యాయ, ఎంఈఓ, డీఈఓ పోస్టులను భర్తీ చేయకుండా.. ఎన్నికల సమయంలో ఏవో కొన్ని కొలువులకు నోటిఫికేషన్లు జారీ చేసి నిరుద్యోగులను మోసం చేస్తుందని విమర్శించారు. అనుమతి లేని ప్రైవేటు పాఠశాలల మూసివేత, అధిక ఫీజులు వసూలు చేస్తూ బహిరంగంగా వ్యాపారం చేస్తున్న పాఠశాలల పట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరించకపోవడం సిగ్గు చేటన్నారు. సర్కారు స్కూళ్లలో వసతుల కల్పన, ఉద్యోగాల భర్తీ, ప్రైవేటు యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని, లేని యెడలా ఏబీవీపీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ రాజేష్, నగర కార్యదర్శి మణికొండల్ రెడ్డి, అజయ్, శ్రీకాంత్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే మోదీ ధ్యేయం



పూడూరు: అంగడిచిట్టంపల్లిలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

పూడూరు: పేదల సంక్షేమమే ప్రధాని నరేంద్రమోదీ ధ్యేయమని, బీజేపీతోనే నీతివంతమైన పరిపాలన అందుతుందని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశ్ పటేల్ అన్నారు. సోమవారం అంగడి చిట్టంపల్లిలో ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మోదీ 9ఏళ్ల పాలనలో అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రజలకు అందాయని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అనీల్‌ముదిరాజ్, మండల ఉపాధ్యక్షుడు శేఖర్, జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్‌చారీ, నాయకులు శ్రావణ్‌గౌడ్, మహేందర్‌గౌడ్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఒకే దేశం ఒకే పన్ను..

మోమిన్‌పేట: ఒకే దేశం ఒకే పన్ను విధానాన్ని తీసుకువచ్చిన ఘనత బీజేపీకే దక్కుతుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి అన్నారు. మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా మోమిన్‌పేట మండలం ఇజ్రాచిట్టంపల్లిలో ఇంటింటికీ పార్టీ సంక్షేమ పథకాలు, విజయాల గురించి వివరించారు. అనంతరం మాట్లాడారు. దేశంలో 70ఏళ్లలో సాధించని విజయాలు కేవలం తొమ్మిదేళ్లలో బీజేపీ సాధించిందని చెప్పారు. మరోసారి పార్టీకి వెన్నుదన్నుగా నిలవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డి, ఎస్టీ మోర్చా మండల అధ్యక్షుడు శివకుమార్, బన్సినాయక్, మాణయ్య తదితరులు ఉన్నారు.

విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి

మున్సిపల్ చైర్మన్ అశోక్‌కుమార్



విద్యార్థినులకు దుస్తులు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్, ఎంపీపీ తదితరులు

పరిగి: విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్, ఎంపీపీ అరవింద్‌రావు అన్నారు. స్థానిక బాలికల వసతిగృహం విద్యార్థినులకు సోమవారం నోటు పుస్తకాలు, బ్యాగులు, యూనిఫామ్స్ అందజేసి మాట్లాడారు. బాలికలు బాగా చదువుకొని ఉన్నతికి ఎదగాలని ఆకాంక్షించారు. బాలికల అభ్యున్నతికి ప్రభుత్వం వసతి గృహాలను ఏర్పాటు చేసి విద్యను అందిస్తుందని, అన్ని రకాల సదుపాయాలను కల్పిస్తుందని పేర్కొన్నారు. వసతి గృహంలో ఎలాంటి సమస్యలు ఉన్నా.. వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ హరిప్రియ, కౌన్సిలర్ శ్రీనివాస్‌నాయక్, నాయకులు ప్రవీణ్‌రెడ్డి, హాస్టల్ వార్డెన్ చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కొడంగల్ రూరల్: విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ బుచ్చయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 1వ పీఆర్సీ సిఫారసులకు అనుగుణంగా పెన్షనర్ల మూల వేతనం నుంచి ఒక శాతం మినహాయించి పూర్తిస్థాయిలో ఈ.హెచ్ఎస్ అమలు చేయాలని, 2వ పీఆర్సీని నియమించి 2023జులై 1వ తేదీ నుంచి ఐ.ఆర్ అమలు పరిచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పెండింగ్ డీఆర్‌లు చెల్లించాలని, ఇ.కుబేర్‌లో 5నెలలుగా పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించాలని, ప్రతి నెల 1వ తేదీన పింఛన్లు అందజేయాలని పేర్కొన్నారు. రూ.398 కింద నియామకాలు జరిగిన స్పెషల్ ఉపాధ్యాయులకు ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, టీఎస్‌జీఆర్ఈఏ సంఘానికి ప్రభుత్వ గుర్తింపు ఇవ్వాలని తదితర సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీఎస్‌జీఆర్ఈఏ కొడంగల్ సంఘం అధ్యక్షుడు వెంకటయ్య, కార్యదర్శి రాధాకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట్‌సింగ్, నర్సిరెడ్డి, కోశాధికారి చంద్రప్ప, విఠల్‌రావు, రమేష్ పాల్గొన్నారు.

అంధత్వ నివారణకు కృషి చేయాలి

కొడంగల్ రూరల్: అంధత్వ నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆఫ్తాల్మిక్ అధికారి డాక్టర్ హరినాథ్‌నెహ్రూ, లయన్స్ క్లబ్ మెంబర్లు అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో లయన్స్ క్లబ్, జిల్లా అంధత్వ నివారణ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఇందులో 113మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 32మందిని మహబూబ్‌నగర్ జిల్లా రాంరెడ్డి కంటి వైద్యశాలకు ఆపరేషన్ చేయించడానికి పంపించారు. 31మందికి అవసరమైన మందులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రతినెలా నిర్వహించే కంటి శిబిరాన్ని దృష్టిలోపం ఉన్నవారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి దాసప్పయాద్, లయన్స్ క్లబ్ మెంబర్లు మురహరి వాసిష్ట, జయతీర్థాచారీ, శ్రీనివాస్‌గౌడ్, కోఆప్షన్ మెంబర్ మునీర్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

బొంరాస్‌పేట: ఇటీవల మరణించిన శ్రీధరచారీ అనే వ్యక్తి కుటుంబాన్ని సోమవారం బీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు. అన్ని విధాలా కుటుంబాన్ని ఆదుకుంటామని మృతుడి భార్య లక్ష్మికి భరోసా ఇచ్చారు. పరామర్శించిన వారిలో బీఆర్ఎస్ తాలూకా యూత్ ప్రెసిడెంట్ నరేశ్‌గౌడ్, దుద్యాల మండలం నాయకులు బసిరెడ్డి, గ్రామ అధ్యక్షుడు శ్యాసం వెంకటయ్య, సింగిల్‌విండో డైరెక్టర్ ఫరీద్, నర్సింహులు గౌడ్, అప్సర్, సాయిలు, అశోక్, శివప్ప ఉన్నారు.

కూడు, గూడు కల్పించని ప్రభుత్వాలు

- ఇల్లు లేని వారికి డబుల్‌బెడ్‌రూం ఇవ్వాలి
- ప్రజా సంఘాల పోరాట వేదిక రాష్ట్ర కన్వీనర్ వీరయ్య



మాట్లాడుతున్న వీరయ్య తదితరులు

పరిగి: దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు అవుతున్నా పేద వాడికి సొంత ఇల్లు లేకపోవడం సిగ్గు చేటని తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక రాష్ట్ర కన్వీనర్ వీరయ్య అన్నారు. నిరుపేదలకు డబుల్‌బెడ్‌రూం, ఇళ్లస్థలాల సాధనకై ఈనెల 18నుంచి 27వరకు నిర్వహిస్తున్న రాష్ట్ర వ్యాప్త బస్సుయాత్ర సోమవారం పరిగి పట్టణ కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇల్లులేని నిరుపేదలకు డబుల్ బెడ్ రూంలు పంపిణీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దేశానికి ఇది చేస్తున్నాం, అది చేస్తున్నాం అని చెప్పుకోవడమే తప్ప.. పేద ప్రజలను ఎవ్వరూ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కనీస సౌకర్యాలైన కూడు, గూడు, గుడ్డను కల్పించడంతో ప్రభుత్వాలు పూర్తిగా విఫల మవుతున్నాయని విమర్శించారు. ఆవాస్‌యోజన పథకం కింద కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు ఒక్క ఇల్లుకూడా మంజూరు చేయలేదన్నారు. ఇల్లు కట్టుకుంటున్న వారికి కేంద్రం రూ.10లక్షలు అందించామని, డబుల్ బెడ్‌రూంల పేరిట రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్‌రాములు, రాష్ట్రనాయకుడు జంగారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య, లక్ష్మి, సైకిలాబ్, మల్లేశ్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉచిత విత్తనాలతో సాగుచేయండి

- అధిక దిగుబడులు పొందండి
- ఎంపీపీ విజయలక్ష్మి



దౌల్తాబాద్: రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ తదితరులు

ధారూరు: జాతీయ ఆహార భద్రత పథకం ద్వారా సరఫరా చేస్తున్న ఉచిత కంది విత్తనాలతో సేద్యం చేసి, అధిక దిగుబడులు పొందాలని ఎంపీపీ విజయలక్ష్మి సూచించారు. ధారూరు క్లస్టర్ రైతులకు సోమవారం రైతు వేదికలో పూర్తి రాయితీ కింద కంది విత్తనాల ప్యాకెట్లను రైతులకు అందజేసి మాట్లాడారు. పీఆర్‌జీ 176 రకం కంది విత్తనాలు రైతులకు మేలు చేస్తాయని, ఈ విత్తనాలను ఎక్కువగా చెలక పొలాల్లోనే వేయాలని ఆమె చెప్పారు. కార్యక్రమంలో రైతుబంధు జిల్లా అధ్యక్షుడు రాంరెడ్డి, మండల అధ్యక్షుడు వెంకటయ్య, వైస్ ఎంపీపీ విజయకుమార్, ఏడీఏ వినోద్‌కుమార్, సర్పంచ్ చంద్రమౌళి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజునాయక్, ఏఎంసీ చైర్మన్ సతీష్‌కుమార్, మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు బసప్ప, ఏఈఓ సంజూరాథోడ్, బీఆర్ఎస్ నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, చెన్నయ్య, రైతులు పాల్గొన్నారు.

దౌల్తాబాద్‌లో..

దౌల్తాబాద్: వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జాతీయ ఆహార భద్రత పథకం కింద రైతులకు సబ్సిడీపై కంది విత్తనాలను ఎంపీపీ విజయ్‌కుమార్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ తిప్పేస్వామి మాట్లాడుతూ మండలానికి 80 క్వింటాళ్ల కంది విత్తనాలు వచ్చాయని తెలిపారు. రైతులు పట్టా పాసుపుస్తకాలు తీసుకువచ్చి విత్తనాలను తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మహిపాల్, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, కోఆప్షన్ జాకీర్, ఏఈఓలు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

తాండూరు రూరల్: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు రామలింగారెడ్డి అన్నారు. సోమవారం సిరిగిరిపేట్ రైతు వేదిక వద్ద రైతులకు జాతీయ ఆహార భద్రత పథకం (ఎన్ఎఫ్ఎస్ఏ) కింద రైతులకు ఉచితంగా కందులు పంపిణీ చేసి మాట్లాడారు. వానాకాలం సీజన్ రైతుబంధు డబ్బులు రైతుల ఖాతాలో జమ అవుతున్నాయని చెప్పారు. పెట్టుబడి సాయం కింద ప్రభుత్వం ఎకరాకు రూ.5 వేలు అందజేస్తోందని, ఉచిత కంది, మినుము విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ ఫర్వీన్, రైతులు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



తాండూరు రూరల్: రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న రామలింగారెడ్డి, ఏఈఓ

పప్పు దినుసుల సాగును..

మర్పల్లి: పప్పు దినుసుల సాగును ప్రోత్సహించేందుకు జాతీయ ఆహార భద్రత పథకం కింద ప్రభుత్వాలు ఉచిత విత్తనాలు పంపిణీ చేస్తున్నాయని రైతుబంధు మండల అధ్యక్షుడు నాయబ్‌గౌడ్ అన్నారు. 100 శాతం సబ్సిడీపై మినుము విత్తనాలను 27 గ్రామ పంచాయతీల చిన్న, సన్న కారు రైతులకు రైతువేదికల్లో అందజేసి మాట్లాడారు. దేశంలో పప్పు దినుసుల కొరత ఉండ కూడదనే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పప్పు ధాన్యాల సాగును ప్రోత్సహిస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు సోయెల్, యాదవ సంఘం మండల అధ్యక్షుడు మల్లేశ్ యాదవ్, ఏఓ వసంత, ఏఈఓలు నీరజ, ప్రశాంత్, క్లస్టర్ రైతులు పాల్గొన్నారు.